

గిరిజన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వాబ గ్రామాన్ని సందర్శించి అక్కడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారికి ఇరువైపులా కాలువలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు. అనంతరం పీవో సీతంపేటలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. దాని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గీతాంజలిని ఆదేశించారు.

లోపం ఎక్కడ?

- 'మన్యం'లో ఆగని మరణ మృదంగం
- అనారోగ్యంతో గిరిజన విద్యార్థుల మృత్యువాత
- చర్చనీయాంశమవుతున్న వరుస ఘటనలు
- ప్రత్యేక వైద్య శిబిరాలు ఎంతో అవసరం
- నిరంతర పర్యవేక్షణ ఉండాలంటున్న ప్రజా సంఘాలు

పార్వతీపురం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్య కారణాలతో మృత్యువాత పడడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఒక రోజు వ్యవధిలో ఇద్దరు వేర్వేరు చోట్ల మరణించడం చర్చనీయాంశంగా మారింది. కురుపాం, జియ్యమ్మ వలస మండలాల్లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు అందర్నీ కలిచి వేస్తున్నాయి. బాధిత కుటుంబాలు కూడా తేరుకోలేక పోతున్నాయి. తమ బిడ్డలు ఆకస్మికంగా దూరమవడాన్ని తల్లిదండ్రులు జీర్ణించు కోలేకపోతున్నారు. గిరిజన విద్యార్థులందరికీ పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని.. రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని ఓ వైపు ప్రభుత్వం.. మరోవైపు ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో వరుసగా గిరిజన విద్యార్థుల మరణాలకు కారణాలేమి టనేది తెలియడ రావడం లేదు. దీనిపై అనేక సందేహాలు వ్యక్తమవు తున్నాయి. అసలెక్కడ లోపం ఉందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.





ఈ చర్యలు తీసుకుంటే..

జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం, కురుపాంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు జీవన్‌కుమార్, నితిన్‌లు ఒక రోజు వ్యవధిలో అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ మరణాలు ఏ కారణంగా సంభవించాయన్న స్పష్టమైన సమాచారం వైద్య ఆరోగ్యశాఖ వద్ద గాని, గిరిజన విద్య శాఖ వద్దగాని లేదు. కాగా విద్యార్థులు మరణించిన తర్వాత బాధపడేకంటే.. ముందస్తుగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ఆశ్రమ పాఠశాలలు, విద్యార్థుల స్థితిగతులపై దృష్టి సారించాల్సి ఉంది. అదేవిధంగా ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించి ప్రత్యేక హెల్త్ రికార్డును నిర్వహించాలి. ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వారి ఆరోగ్యాలను పర్యవేక్షించాలి. చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి.. మెరుగైన చికిత్స అందిస్తే.. మరణాలు సంభవించే పరిస్థితి ఉండదని గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. తక్షణమే ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని, బాధిత కుటుంబాలను

-మిగతా 8వ పేజీలో...

- గిరిజన విద్యార్థి మృతిపై మంత్రి సంధ్యారాణి విచారణ
- బాధిత కుటుంబానికి భరోసా

న్యాయం చేస్తాం

జియ్యమ్మవలస, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన గిరిజన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేస్తామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జీవన్‌కుమార్ ఆకస్మిక మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా సహ విద్యార్థులు పవన్‌కుమార్, సంతోష్, ప్రేమ్‌కుమార్, సిద్ధులతో మాట్లాడారు. ఆ తర్వాత హెచ్‌ఎం ఎస్.తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్.గణపతిరావులను ప్రశ్నించారు. విద్యార్థికి ఎటువంటి అనారోగ్యం ఉన్నట్టు చెప్పలేదని.. ఆకస్మాత్తుగా చనిపోయాడని వారు తెలిపారు. అనంతరం మృతుని తండ్రి ఎస్.కృష్ణారావుతో మంత్రి మాట్లా డారు. ఇదే సమయంలో ప్రజా సంఘాల నాయకులు గంగునాయుడు, సీతా రాం, రంజిత్‌కుమార్ కలుగజేసుకుని రీ-ఎంక్వైరీ వేయాలన్నారు. దీనిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుని తండ్రి కోరితే కచ్చి తంగా రీ-ఎంక్వైరీ వేయిస్తా నని చెప్పారు. దీనిపై విద్యార్థి తండ్రి కృష్ణారావు మాట్లాడుతూ.. 'రీ-ఎంక్వైరీ వద్దు.. నా భార్య నాలుగు నెలల కిందటే మృతి చెందింది. ఈలోగా నా ఒక్కగా నొక్క కుమారుడు మృతి చెందాడు. ఈ విషా దం నుంచి తేరుకోలేకపోతున్నా. నా ఇద్దరు ఆడ బిడ్డలను చదివించుకునే అవ కాశం కల్పించండి' అని వేడుకున్నాడు. కాగా ప్రభుత్వం అండగా

-మిగతా 8వ పేజీలో...



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి, పక్కన ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరి, జయకృష్ణ



వైసీపీ.. కకావికలం

- పార్వతీపురం మున్సిపాల్టీలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం
- వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్న కౌన్సిలర్లు
- త్వరలో మరికొందరు వచ్చేందుకు సిద్ధం
- పెరుగుతున్న సైకిల్ బలం.. తగ్గుతున్న ఫ్యాన్ స్పీడు





పార్వతీపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాల్టీలో టీడీపీ బలం పెరుగుతోంది. వైసీపీ స్పీడ్ తగ్గుతోంది. ఇటీవల ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా.. కో ఆప్షన్ సభ్యులతో కలిపి ఆ పార్టీ సభ్యుల సంఖ్య 13కు చేరింది. రానున్న రాజుల్లో మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. ఏదేమైనా పాలకవర్గంలో ఆ పార్టీ సంఖ్యా బలం తగ్గుతుండడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. మరోవైపు ఆ పార్టీ నేతల్లో కలవరం మొదలైంది.

ఒక్కొక్కరుగా జారుకుంటూ..

గత మూడేళ్లు పార్వతీపురం మున్సిపాల్టీలో వైసీపీ కౌన్సిలర్ల హవా కొనసాగింది. అయితే ఇప్పుడు సీన్ మారుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాలకవర్గంలో వారి బలం తగ్గుతూ వస్తుంది. 30 వార్డులకు గాను 25 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు ఉండేవారు. తాజా ఎన్నికల తర్వాత మున్సిపాల్టీలోని రాజకీయ ముఖచిత్రంలో మార్పులు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం పథకాలకు ఆకర్షితులైన కొందరు వైసీపీ ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా ఆ పార్టీ నుంచి జారుకుంటున్నారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే జోగారావుకు ముఖ్య అనుచరగణంగా పేరొందిన 7వ వార్డు కౌన్సిలర్ బి.ఆనంద్, 9వ వార్డు కౌన్సిలర్ పి.జయంతి, 10వ వార్డు కౌన్సిలర్ జె.దివ్య, 11వ వార్డు కౌన్సిలర్ జి. కల్యాణి, ఆమె భర్త మురళీ, 12వ వార్డు కౌన్సిలర్ తాడ్డి అరుణ, ఆమె భర్త శంకరరావులతో పాటు 5వ వార్డు కో ఆప్షన్ సభ్యుడు వెంకటరావులు ఇటీవల టీడీపీలో చేరారు. దీంతో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జోగారావు గెలుపుకోసం శ్రమించిన వారు వైసీపీని వీడడం ఆ పార్టీ ముఖ్య నేతలకు మింగుడు పడడం లేదు. ఇలా ఉండగా మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు, ఇద్దరు ఇండిపెండింట్ టీడీపీలోకి జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. వారంతా ఎమ్మెల్యే విజయచంద్ర పిలుపు కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిసింది.

టీడీపీ జెండా ఎగరనుందా?

వాస్తవంగా మున్సిపాల్టీలో 30 వార్డులు ఉండగా.. గతంలో ఐదుగురు టీడీపీ, ఇద్దరు ఇండిపెండెంట్ , ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు మినహా మెజార్టీ సభ్యులంతా వైసీపీ వారే ఉండేవారు. ప్రస్తుతం చైర్‌పర్సన్, ఇద్దరు వైస్‌చైర్మన్‌లతో పాటు 11 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు. టీడీపీ వారు 13 మంది ఉన్నారు. బీజేపీకి చెందిన కౌన్సిలర్, ఇద్దరు ఇండిపెండెంట్లు, ముగ్గురు కో ఆప్షన్లు మద్దతు తెలిపితే త్వరలోనే మున్సిపాల్టీలో టీడీపీ జెండా ఎగిరే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

చూసొద్దాం రండి

- ఉత్తరాంధ్రలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు
- కార్తీక మాసంలో చూడదగ్గ ప్రదేశాలు

6లో

వీడని ఉత్కంఠ

- స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై కొనసాగుతున్న సస్పెన్స్
- కోడ్ అమలుపై జడ్పీ సీఈవో మార్గనిర్దేశం

8లో

వ్యవసాయ పరికరాల కోసం

ఎదురు చూపు

- గత ఐదేళ్లూ అందించని వైసీపీ ప్రభుత్వం
- తీవ్ర ఇబ్బందులు పడిన రైతులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

6లో

గర్భిణులపై నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్


వెలగవలస పాఠశాలలో విద్యార్థులతో పద్యాలు చదివిస్తున్న కలెక్టర్

సాలూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులపై నిర్లక్ష్యం చూపరాదని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం కురుకూటి, వెలగవలసలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాని, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో జాయిన్ చేయాలని సూచించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షయ రోగులు సక్రమంగా మందులు వాడేలా ఏఎన్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు. సికిల్ సెల్ ఎనిమియాతో బాధపడుతున్న కురుకూటికి చెందిన హేమలతను జిల్లా ఆసుపత్రికి తరలించాలని, అవసరమైతే రక్తమార్పిడి చేయించాలని తోణాం వైద్యుడు అజయ్‌ను ఆదేశించారు.

ప్రతి శుక్రవారం గ్రామదర్శిని

పార్వతీపురం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి.. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నారని చెప్పారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో దశల వారీగా అన్ని పంచాయతీల్లో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండ రామాలయ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణ పనుల ప్రగతిపై సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. దేవాలయ అభివృద్ధికి మాస్టార్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. పార్వతీపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు వ్యాపార సంస్థలు, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

గుమ్మలక్ష్మీపురం/కురుపాం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహించే పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. నాటు సారా, గంజాయి రవాణా అరికట్టాలని, ఆదేశించారు. అనంతరం ఎల్విన్‌పేటలోని చెక్ పోస్టును పరిశీలించారు. అక్కడి నుంచి కురుపాం మండలం నీలకంఠాపురం పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. మహిళా పోలీసుల విధులపై ఆరా తీశారు.


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ


సంగంవలస తోటలో సంచరిస్తున్న గజరాజులు


కదలని గజరాజులు

పార్వతీపురం రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం మండలం నుంచి గజరాజులు కదలడం లేదు. వాటిని ఒడిశావైపు మళ్లించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇప్పటికే మూడు గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా నిన్నమొన్నటి వరకు జిల్లా కేంద్రానికి అతి సమీపంలో సంచరించిన ఏనుగులు శుక్రవారం సంగంవలస గ్రామ సమీపంలో ఉన్న ఎస్‌టీఎం తోటలో దర్శనమిచ్చాయి. దీంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోయారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామానికి సమీపంలో ఏనుగులు ఉండడంతో.. అవి ఎవరిపై దాడి చేస్తాయోనని తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే గజరాజులు అడ్డూరువలస తదితర ప్రాంతాల్లో పంటలను ధ్వంసం చేశాయి. దీంతో ఈ ప్రాంత రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. పంట, ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకముందే అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి పార్వతీపురం మండలం నుంచి ఏనుగులను తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

చూసొద్దాం రండి



విజయనగరం వద్ద రామనారాయణం వ్యూ



సాలూరు మండలంలో దండిగాం జలపాతం



బొర్రాగుహలు

● ఉత్తరాంధ్రలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు

● కార్తీక మాసంలో చూడదగ్గ ప్రదేశాలు

సాలూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆరంభమైంది. ఈనెలలో పిక్నిక్‌లకు, విహారయాత్రలకు వెళ్లడానికి ఉత్సుకత చూపుతారు. రొటీన్ లైఫ్ బిజీగా గడిపేవారు కార్తీకమాసంలో కాస్త సేద తీరడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. ఉత్తరాంధ్రలో ప్రధాన పర్యాటక ప్రాంతాలుగా విశాఖ, అరకులోయ ఉన్నాయి. పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా చాలా పర్యాటక ప్రాంతాలున్నాయి. ఈ కార్తీకమాసంలో సరదాగా గడిపేందుకు వాటిని సందర్శించడానికి ప్రణాళిక రూపొందించుకుని వెళ్తే మేలు.

● పార్వతీపురం మన్యం జిల్లా, ఉత్తరాంధ్రవాసులు ఎక్కువగా విశాఖ, అరకుతో పాటు పలు పర్యాటక ప్రాంతాల సందర్శనకు ప్రాధాన్యమిస్తారు. బంగాళాఖాతం సముద్రతీరాన ఉన్న విశాఖపట్నంలో చూడాల్సిన ప్రదేశాలున్నాయి. రామకృష్ణ బీచ్, రుషికొండ బీచ్, గంగవరం బీచ్, కైలాసగిరి, ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్, శివాజీ పార్క్, ఉడా పార్క్, పోర్ట్ తదితరాలు చూడదగ్గవి. కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణ. ఈ కొండపై నుంచి సముద్ర అందాలు, విశాఖ అందాలను వీక్షించవచ్చు. కైలాసగిరికి ఆర్టీసీ బస్సులో నేరుగా వెళ్లవచ్చు కొండ దిగువ నుంచి రోప్‌వే ద్వారా వెళ్లవచ్చు ఆర్‌కే బీచ్, రుషికొండ బీచ్‌ల్లో సముద్ర అలలను వీక్షించి సేదతీరవచ్చు. అలాగే ఉడా కాలనీ, శివాజీ పార్క్‌ల్లో పర్యాటకులు ఉల్లాసంగా గడపవచ్చు. ఉడా పార్క్ సముద్రతీరానికి అనుకుని ఉంటుంది. ఆర్‌కే బీచ్ సమీపాన కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, విశాఖ మ్యూజియంలు చూడదగ్గవి. విశాఖలో ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్‌లో వివిధ జంతు, పక్షాదులను వీక్షించవచ్చు. ఈ జూలో 850 రకాల జంతువులు, 75 రకాల పక్షులను, వివిధ జాతుల పాములను చూడవచ్చు. సింహగిరిపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి, సింహాచలం వెళ్లడానికి పర్యాటకులు ప్రాధాన్యమిస్తారు. సింహాచలానికి నేరుగా బస్సులు ఉన్నాయి. అలాగే పర్యాటకులు అరకు వెళ్లడానికి ప్రాధాన్యమిస్తారు. అరకుకు విశాఖ, విజయనగరం నుంచి నేరుగా బస్సులున్నాయి. విశాఖ నుంచి లేదా కొత్తవలస నుంచి అరకుకు రైలులో పయనించడం గొప్ప అనుభూతిగా చెప్పుకోవచ్చు. కొండ గుహల లోపల నుంచి, ప్రకృతి అందాల మధ్య నుంచి రైలు వెళ్తుతూ ఉంటే మధురా నుభూతిని పొందవచ్చు. బొర్రాగుహలు ప్రకృతి సిద్ధంగా ఉంటాయి. వీటికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కటికి జలపాతం, అరకులో పద్మావతి గార్డెన్, చాపరాయి జలపాతం, అరకు గిరిజన మ్యూజియం తదితర చూడదగిన ప్రదేశాలున్నాయి. అరకుకు 45 కిలోమీటర్ల దూరంలో మాచ్‌ఖండ్ విద్యుత్ ఉత్పాదన కేంద్రం, డుడుమా జలపాతాలున్నాయి. ఇక్కడికి బస్సు సౌకర్యంతో పాటు అరకు నుంచి జీపులు, టాక్సీలు అందుబాటులో ఉంటాయి.



ఏవోబీలో కొఠియా గ్రూప్ గాలిగబదారు జలపాతం



అరకుకు రైలులో పయనం

ఏపీ టూరిజయం ప్యాకేజీలు

విశాఖపట్నంలో పర్యాటక ప్రాంతాలను చూపించడానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీ టూరిజం సంస్థ పలు ప్యాకేజీలతో పర్యాటకులకు సేవలందిస్తున్నది. ఈ సంస్థ కైలాసగిరి, సింహాచలం, తొట్లకొండ, ఫిషింగ్ హార్బర్‌లో బోటింగ్, రిషికొండ బీచ్, విశాఖ, కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియంలను చూపించడానికి ఏసీ బస్సులను సైతం నడుపుతుంది. అరకుకు ఈ సంస్థ రైలు ప్యాకేజీతో పర్యాటకులను తీసుకెళ్తుంది. బొర్రాగుహలు, అరకుకు వెళ్లేందుకు కూడా సదుపాయం కల్పిస్తోంది. అరకు, త్యాడ, మాచ్‌ఖండ్, డుడుమా జలపాతం, జయపురం, కుతుబ్‌షా గుహలతో పాటు జగదల్‌పూర్, చిత్రకూట్ జలపాతానికి మూడు రోజుల ప్యాకేజీ అందుబాటులో ఉంది. అరసవల్లి, శ్రీముఖలింగం, త్యాడ, అరకు, బొర్రాగుహలతో మరో ప్యాకేజీ ఉంది.

● విజయనగరం పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఎన్‌సీఎస్ చారిటేబుల్ ట్రస్ట్ నిర్మించిన రామనారాయణం ప్రత్యేక ఆకర్షణగా మారింది. విజయనగరం జిల్లాలో గోవిందపురం ఆలయాలు, చింతపల్లి బీచ్, విజయనగరం నుంచి 28 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుణ్యగిరి దారాకొండమ్మ ఆలయం పర్యాటకులను అలరిస్తాయి. విజయగనగరంలో పైడితల్లి అమ్మవారి దేవాలయం, గజపతుల కోట, బొబ్బిలిలో కోట, వేణుగోపాల ఆలయం, తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారు ఉన్నాయి. తాటిపూడి రిజర్వాయర్ వద్ద ఏకో టూరిజం వారి రిసార్ట్ సైతం ఉన్నాయి. విడిది, భోజన వసతులున్నాయి.

● శ్రీకాకుళం జిల్లాలో అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, శాలిహుండం, కళింగపట్నం బీచ్‌లను చూడదగిన ప్రదేశాలు.

● పార్వతీపురం మన్యం జిల్లాలో తోటపల్లి రిజర్వాయర్, వేంకటేశ్వస్వామి దేవాలయం, ఆడలి వ్యూ పాయింట్, సాలూరు మండలంలో పలు జలపాతాలున్నాయి. వీటి సందర్శనకు పార్వతీపురం, విజయనగరం నుంచి బస్సులు అందుబాటులో ఉన్నాయి.

● కార్తీకమాసంలో విహారయాత్రకు వెళ్లేవారు పలు జాగ్రత్తలు పాటించాలి. సముద్ర, నది, జలపాతాల ప్రాంతాల్లో లోతు ప్రదేశాలకు వెళ్లకూడదు. సరైన ప్రణాళిక, తగిన సామగ్రితో పర్యటనలు చేయడం మేలు.



శ్రీకాకుళం జిల్లాలో శ్రీముఖలింగం ఆలయం

వ్యవసాయ పరికరాల కోసం
ఎదురు చూపు



● గత ఐదేళ్లూ అందించని వైసీపీ ప్రభుత్వం

● తీవ్ర ఇబ్బందులు పడిన రైతులు

● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కొమరాడ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని.. వ్యవసాయానికి పెద్దపీట వేశామని చెప్పుకొచ్చిన వైసీపీ సర్కారు ప్రకటనలకే పరిమితమైంది. గత ఐదేళ్లు అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ప్రధానంగా వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలకు మంగళం పాడేసింది. చివరకు టార్పాలిన్లను కూడా అందించలేకపోయింది. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాయితీపై వాటిని పంపిణీ చేసేవారు. అయితే గత వైసీపీ సర్కారు విస్మరించడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే వారంతా ఆశలు పెట్టుకున్నారు. వ్యవసాయ రంగానికి తిరిగి పూర్వ వైభవం వస్తుందని, సాగు కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు.

గత ఐదేళ్లూ ఇబ్బందులే..

సాగుకు యంత్ర పరికరాలు ఎంతో అవసరం. స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు రైతులకు సాగులో సహాయకారిగా ఉంటాయి. పంటలకు నష్టం వాటిల్లకుండా మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మ పోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అయితే గత ఐదేళ్లు రాయితీపై వాటిని పంపిణీ చేయలేదు. దీంతో రైతులు అష్టకష్టాలు పడ్డారు. ప్రధానంగా స్ప్రేయర్ల కొరతను ఎదుర్కొన్నారు. రాయితీ స్ప్రేయర్ల కోసం గత వైసీపీ సర్కారు హయాంలో వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. కొన్నిచోట్ల అద్దెప్రాతిపదికన కూడా లభించేవి కాదు. మరోవైపు మందు పిచికారీలో జాప్యం జరగడం వల్ల పంటలు దెబ్బతినేవి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున బైవాస్ స్ప్రేయర్ల పంపిణీ జరిగింది. కాగా వాటిలో ఉన్న కొన్ని స్ప్రేయర్లతోనే ఇప్పటివరకు రైతులు నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం వారికి స్ప్రేయర్లతో పాటు కల్టివేటర్లు, పవర్ వీడర్, ట్రాక్టర్లు, ఇలా పది రకాల యంత్ర పరికరాలను రాయితీపై పంపిణీ చేయాల్సి ఉంది.

సూక్ష్మ పోషకాల కోసం పాట్లు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం వాటిని రాయితీపై రైతులకు అందించేది. కాగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు పంపిణీ చేపట్టలేదు. సూక్ష్మ పోషకాల (జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం) కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తుంచాల్సి వస్తోంది. అయితే డిమాండ్ దృష్ట్యా వాటి ధరలు అమాంతం పెరిగిపోవడంతో అన్నదాతలపై ఆర్థిక భారం పడుతోంది. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాల కోసం ఎదురు చూస్తున్నారు.

ఆదేశాలు రాలేదు..

రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీపై ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. అర్హులకు వాటిని అందిస్తాం.

– పి.శంకరరావు, ఏవో, కొమరాడ







నేటి నుంచి నాటిక ప్రదర్శనలు

● మూడు రోజుల పాటు నిర్వహణ

● వేదిక గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియం

విజయనగరం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నాటకం నవరస భరితం. ప్రజా చైతన్య కోసం పుట్టిన కళ. ఎవరికైనా సాంఘిక నాటకం అనగానే విజయనగరం గుర్తొస్తుంది. మహాకవి గురజాడ అప్పారావు కన్యాశుల్కం దురాచారంపై కలం విదిల్చిన నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది నాటక రచయితలు, నటీ, నటులు, సాంకేతిక నిపుణుల వల్ల విజయనగరం ఖ్యాతి విరాజిల్లుతోంది. గత ఏడు సంవత్సరాలుగా నటరత్న నాటక పరిషత్ నిర్వాహకులు నగరంలో నటరత్న ఎన్టీఆర్‌ను స్మరించుకుంటూ ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు విజయనగరం గురజాడ కళాభారతి ఆడిటోరియం వేదికగా సిద్ధమైంది. 9, 10, 11 తేదీల్లో రోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిచే నాటిక ప్రదర్శనలు ఉంటాయని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్ తెలిపారు. పోటీల్లో రోజుకు రెండు నాటిక సమాజాలు పాల్గొంటాయన్నారు. మూడో రోజు సభలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. ఉత్తరాంధ్రకు చెందిన పలువురు నాటక ప్రియులు, రచయితలు, వక్తలు, నటీనటులు హాజరవుతారన్నారు.

నేటి ప్రదర్శనలు ఇవే

హైదరాబాదు కళాసంస్థకు చెందిన కళాకారులు 'రైతే రాజు' నాటిక ప్రదర్శించనున్నారు. ఇక రెండో ప్రదర్శనగా విజయనగరానికి చెందిన నాటకక కళాల సంస్థ కళాకారులు 'బంధనం' అనే నాటిక ప్రదర్శించనున్నారు.



సిద్ధమైన గురజాడ కళాభారతి ఆడిటోరియం

స్నేహ సౌరభాలు



రెండు దశాబ్దాల క్రితం తొలిసారిగా..

● 45 ఏళ్లుగా సాగుతున్న అనుబంధం

● ఒకరి మరణంతో సేవలకు శ్రీకారం

● 20ఏళ్లుగా కొనసాగుతున్న కార్యక్రమాలు

● ఏడాదికోమారు కుటుంబాలతో కలయిక

● నేడు, రేపు రాజాంలో కలుస్తున్న వైనం

రాజాం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979లో వారంతా ఆరోతరగతిలో చేరారు. ఇస్త్రీ బట్టలతో కొందరు.. చిరిగిన నిక్కరు, చొక్కాలతో మరికొందరు..! పాఠశాలకు నడిచొచ్చేవారు కొందరైతే.. సైకిల్, స్కూటర్‌పై వచ్చేవారు మరికొందరు..! ఎవరిస్థాయి ఏదైనా.. బడికి ఎవరెలా వచ్చినా.. నేలపై కూర్చుని చదువుకున్నారు. అప్పట్లో వారంతా 120 మంది. నాటి నుంచి నేటి వరకు కలిసి సాగుతూనే ఉన్నారు. కష్టసుఖాల్లో భాగస్వాములవుతున్నారు. వారిమధ్య ఆర్థిక సంబంధాలు ఎప్పుడూ అడ్డుగోడ కాలేదు. కొందరు అమెరికా, జర్మనీలో స్థిరపడితే.. మరికొందరు వైద్యులుగా ఉన్నారు. వీరిలో రాజకీయ నాయకులు న్నారు. ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు.. బస్‌క్లీనర్లు.. గుమస్తాలు.. డ్రైవర్లు.. ఇలా అన్ని వృత్తుల్లోనూ ఉన్నారు. వారే రాజాంకు చెందిన ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ 1979-89 బ్యాచ్.

మిత్రుడి మరణంతో..

1979లో రాజాం ఉన్నతపాఠశాలలో ఆరోతరగతిలో చేరిన వారంతా ఇంటర్మీడియట్ వరకు రాజాంలోనే చదువుకున్నారు. ఎవరు ఏ గ్రూపులో చదివినా అంతా కలిసే ఉన్నారు. ఇంటర్ తరువాత కొందరు 1989లో డిగ్రీ పూర్తిచేశారు. మరికొందరు ఇంజనీరింగ్, మరికొందరు ఎంబీబీఎస్.. ఇలా ఉన్నతవిద్య సాగించారు. అయితే వారిలో ఓ మిత్రుడు (టైలర్) ఆకస్మికంగా మృతి చెందారు. అప్పటినుంచే వారిలో కొత్త ఆలోచన పుట్టుకొచ్చింది. మిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించారు. ఇదే స్ఫూర్తితో 2004లో ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ (1979-89)గా ఏర్పడ్డారు. ఇందుకోసం రాజాంకు చెందిన గ్యాస్ డీలర్ సాయిప్రశాంత్ కుమార్, ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు పి.ఎల్.ఎన్.రాజు (రఘు) కృషి చేశారు. గడచిన 20ఏళ్లుగా సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

ఏడాదికోమారు..

వివిధ వృత్తుల్లో ఉన్న వారంతా ఏడాదికోమారు కలవాలని నిర్ణయించుకున్నారు. రాజాం ప్రాంతంలోనే సుమారు 80 మంది తరచూ కలుస్తున్నా.. ఇతర చోట్ల స్థిరపడిన వారు మాత్రం కచ్చితంగా కార్తీకమాసం రెండో ఆదివారం రాజాంలో కలిసేలా నిర్ణయించుకున్నారు. 2004 నుంచి ఏటా కార్తీకమాసం రెండో ఆదివారం మిత్రులంతా కుటుంబాలతో కలిసి రాజాంలో కలుస్తున్నారు. అప్పటివరకూ చేపట్టిన సేవా కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టే వాటిపై చర్చిస్తారు. ఈమేరకు అవసరమైన మొత్తాన్ని సమకూర్చేలా చేసుకుంటారు. సంఘంగా ఏర్పడి 20 ఏళ్లు కావడంతో ఈఏడాది రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో కొన్ని..

● రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రుల్లేని విద్యార్థులకు రెండు దశాబ్దాలుగా యూనిఫాం అందజేస్తున్నారు.

● 2005 నుంచి 2016 వరకూ 11 ఏళ్లపాటు పదోతరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు.

● తాము చదువుకున్న పాఠశాలలోని కళాభారతి ఆడిటోరియం పునర్నిర్మాణం చేశారు.

● 2014లో కొత్తగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వసతి లేకపోవడంతో జూనియర్ కళాశాలలో తరగతుల నిర్వహణకు రూ.60 వేలు మెటీరియల్ ఇచ్చారు.

● ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారందరికీ అయిదేళ్లుగా ట్రావెల్ బ్యాగులు అందజేస్తున్నారు.



రెండు దశాబ్దాల క్రితం తొలిసారిగా కలుసుకున్న స్నేహితులు

రసపట్టులో రంజీ మ్యాచ్

● అంధ్రా ముందు 320 పరుగుల లక్ష్యం



విజయనగరం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా - ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. ఆంధ్రా జట్టు ముందు ఉత్తరాఖండ్ జట్టు భారీ లక్ష్యాన్ని ఉంచింది. 321 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు ఆదిలోనే వికెట్ కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఇప్పటికే పిచ్ బౌలర్లకు సహకరిస్తోంది. ఆట మరో రోజు మిగిలిఉండగా చేతిలో 9 వికెట్లు ఉన్నా.. ఉత్తరాఖండ్ జట్టు బౌలర్లను ఎదురొడ్డి ఆంధ్రా నిలుస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానం పిచ్ బౌలర్లకు సహరిస్తుండడంతో బ్యాటర్లు చెమటోడ్చుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 338 పరుగులు చేసిన ఉత్తరాఖండ్ జట్టు.. ఆంధ్రా జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 146 స్వల్ప స్కోరుకే పరిమితం చేసి 192 భారీ ఆధిక్యాన్ని సాధించింది. శుక్రవారం మూడో రోజు 92/4 ఓవర్ నైట్ స్కోర్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు బ్యాటర్లను పర్యాటక జట్టు బౌలర్లు ఏదశలోనూ కోలుకోనివ్వలేదు. రెండోరోజు స్కోర్‌కు 54 పరుగులే జోడించి ఆంధ్రా జట్టు ఆలౌటైంది. సీనియర్ బ్యాటర్ హనుమ విహారి 43 పరుగులు చేసి అవుట్ కాగా, మిగతా వారు స్వల్ప స్కోర్‌కే పరిమితమయ్యారు. అనంతరం రెండో ఇన్నిం గ్స్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ జట్టు.. ఆంధ్రా జట్టు బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం భారీగా ఉండటంతో జట్టు కెప్టెన్ 128/9 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి ఆంధ్రా ముందు 321 పరుగుల లక్ష్యాన్ని ఉంచారు. ఆంధ్రా ఫాస్ట్ బౌలర్లు స్టీఫెన్, కేవీ శశికాంత్ మూడేసి వికెట్లు సాధించగా, లలిత్‌మోహన్ రెండు, పీవీఎస్ఎన్ రాజు ఒక వికెట్ సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 8 పరుగులు చేసింది. శనివారం ఆటకు ఆఖరు రోజు కావడంతో 90 ఓవర్లు ఆడాల్సి ఉంది. జట్టు భారమంతా కెప్టెన్ రషీద్, సీనియర్ బ్యాటర్లు హనుమవిహారి, కె.ఎస్.భరత్‌పైనే ఉంది.





ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

▸▸ కలెక్టర్ అంబేడ్కర్

లక్కవరపుకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల, తెగల అత్యాచార నిరోధక చట్టాన్ని స్వార్థ అవసరాల కోసం దుర్వినియోగపరచొద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం వారి ఆధ్వర్యంలో ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట వద్దగల ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్‌తో పాటు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం వచ్చి 35 ఏళ్లు గడుస్తున్నా ప్రజల్లో పూర్తి అవగాహన రాలేదన్నారు. అత్యాచార చట్టం రక్షణ కోసమేగానీ స్వార్థం కోసం కాదన్నారు. చట్టం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ కులం పేరుతో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోరాదన్నారు. 1989లో వచ్చిన ఈ చట్టం రెండుమార్లు మార్పులు జరిగాయన్నారు. సాంఘిక బహిష్కరణ, కులదూషణ, ఉద్యోగ బహిష్కరణ వంటివి నేరమన్నారు. సీఐడీ విశాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి జి.ప్రేమ్‌కాజల్ మాట్లాడుతూ ఏపీ సీఐడీ ఆధ్వర్యాన మొదట అనకాపల్లిలో అవగాహన సదస్సు పెట్టామని, రెండవది ఎల్‌కోటలో పెట్టామన్నారు. ఈ చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సీఐడీ డీఎస్పీ భూపాల్, విజయనగరం డీఎస్పీ వీరకుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ రామానందం, తహసీల్దార్ ప్రసాదరావు, న్యాయ నిపుణులు, దళిత నేతలు తదితరులు ఈ చట్టంపై అవగాహన కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

● హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు ● విజినిగిరిలో ఘటన

జామి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజినిగిరి గ్రామంలో యువకుడు అనుమానస్పదంగా మృతి చెందాడు. దీనికి సంబంధించి శుక్రవారం స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనివాడ అచ్చిబాబు(35) తన తల్లి అచ్చియమ్మతో కలిసి నివసిస్తున్నాడు. అయితే పెళ్లి కాలేదన్న బాధతో అచ్చిబాబు తాగుడుకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో రెండునెలల క్రితం పనికోసం హైదరాబాద్ వెళ్లి నాగుల చవితికి గ్రామానికి వచ్చాడు. రెండునెలల క్రితం గ్రామంలో ఒక వ్యక్తి సెల్‌ఫోన్ పోవడం, దీనికి సంబంధించి మృతుడికి మరో వ్యక్తికి మధ్య చిన్న వివాదం చోటుచేసుకుంది. అయితే గురువారం రాత్రి సమయంలో సదరు వ్యక్తితో కలిసి వెళ్లాడని, అలా కొంతసేపటికే గ్రామశివారున ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చనిపోయి కనిపించాడన్నారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని సీఐ రవికుమార్, ఎస్ఐ వీరజనార్దన్‌తో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఉదయం గ్రామంలోకి క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ వచ్చి పరిశీలించాయి. ఈ విషయంపై మృతుడి అక్క కొండమ్మ మాట్లాడుతూ తన తమ్ముడును అదే గ్రామానికి చెందిన వెంపదాపు సూరిబాబు మద్యం మత్తులో కొట్టి చంపేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుతో పోలీసులు దీనిని హత్యకేసుగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అచ్చిబాబు తల్లి అచ్చియమ్మకు మాటలు రావు. ఈమె పెద్ద కుమారుడు తాతారావు అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. ఇప్పుడు చిన్న కుమారుడు కూడా మృతి చెందడంతో ఈమె అనాథగా మారింది.


అచ్చిబాబు (ఫైల్)

టీడీపీ సభ్యత్వ నమోదు పరిశీలన


ఎస్.కోట టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట, నవంబరు8(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి లేఅవుట్ వద్ద శుక్రవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పరిశీలించారు. పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పొట్నూరు అప్పలరాజు(సాయిరాం) ఆధ్వర్యంలో జరిగిన ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఉపాధి లేని వారికి పార్టీ సాధికారత విభాగం ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు.

నోటీసులు ఇవ్వకుండా విధుల్లోంచి తొలగించారు


పాఠశాల ముందు కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలుపుతున్న పార్వతి

బొబ్బిలి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విధుల్లోంచి తొలగించారని గొల్లపల్లి డీపీఈపీ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న జి. పార్వతి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం పార్వతి కుటుంబ సభ్యులు పాఠశాల వద్ద కూర్చొని నిరసన తెలిపారు. పార్వతి మాట్లాడుతూ పని తీరు సరిగా లేకపోవడంతో తనను విధుల నుంచి తొలగించేందుకు పాఠశాల కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు చెప్పారన్నారు. ఇందులో స్థానిక వార్డు కౌన్సిలర్ వెంకటరమణ ప్రమేయం ఉందని, 20 సంవత్సరాల నుంచి మా అమ్మ ఈ ఉద్యోగం చేసేదని, అమ్మ చనిపోయాక నేను చేస్తున్నానని, ఇంత వరకూ తనమీద ఎలాంటి రిమార్క్ లేదని, అయినా నన్ను తొలగించడం అన్యాయమన్నారు. ఉద్యోగం లేకుండా తను పిల్లలతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తిరిగి తనను విధుల్లో చేర్చుకోవాలని కోరారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరగా, పాఠశాల కమిటీ నిర్ణయం తీసుకుందని, ఇందులో తన ప్రమేయం లేదన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు


జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ రాజ్యలక్ష్మి

గరివిడి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని విజయనగరం జేఎన్‌టీయూ గురజాడ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. గరివిడి అవంతీ సెయింట్ థెరీసా ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమం ప్రిన్సిపాల్ జామువా జయప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రాష్ట్రం, దేశం పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతోందని, ఇలాంటి సమయంలో ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. అనంతరం అవంతీ క్రోనికల్ న్యూస్ లెటర్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, డ్యాన్సులు ఎంతో ఆకట్టుకున్నాయి. రాష్ట్ర మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు, చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి, వైజాగ్ విప్రో లీడ్ కన్సల్టెంట్ టి.సురేష్, గరివిడి ఓం శాంతి ప్రతినిధి బ్రహ్మకుమారి హేమలత, విద్యాసంస్థల ప్రతినిధి ఎం.మహేష్, ఏవో జి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

బొబ్బిలి రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధమైందని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విలేజ్ వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించిన టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, పీఏసీఎస్ సిబ్బందితో కొనుగోలుకు సంబంధించి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉప తహసీల్దార్ సాయికృష్ణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ముందస్తుగా టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

విధుల్లో చేరిన ఏడాదికే..

● ఫెర్రో ఎల్లాయిస్ కార్మికుడి మృతి

● పని చేస్తుండగా భవనం పైనుంచి జారిపడిన వైనం


రామారావు (ఫైల్)

బొబ్బిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విధుల్లో చేరిన ఏడాదికే ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దత్తిరాజేరు మండలం బూర్జవలస గ్రామానికి చెందిన గేదెల రామారావు(45) అనే వ్యక్తి గజపతినగరంలోని ఓ పరిశ్రమలో కొన్నేళ్లుగా పని చేసేవాడు. అయితే, ఏడాది కిందట అక్కడ మానేసి బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని ఎండీఏ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలో చేరాడు. కంపెనీలో వెల్డింగ్ వర్క్స్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు డ్యూటీకి వచ్చాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి కాలు జారి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే బొబ్బిలి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం సర్వజన ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేయగా.. కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. రామారావుకు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కాగా, కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

బొబ్బిలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి గ్రోత్ సెంటర్ ఎండీఏ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో మరణించిన గేదెల రామారావుకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని బొబ్బిలి సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శంకరరావు డిమాండ్ చేశారు. కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలన తరచూ కార్మికులు చనిపోతున్నారన్నారు. జిల్లా అధికారులు, ప్రభుత్వం వీళ్లపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చనిపోయిన కార్మికులకు 25 లక్షలు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గ్రోత్ సెంటర్ నాయకులు ఎస్ గోపాలు, శ్రామిక మహిళ నాయకురాలు పుణ్యవతి పాల్గొన్నారు.

సహస్ర నామ కుంకుమార్చన



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు, దీపారాధన

రాజాం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని వస్త్రపురి కాలనీలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించా రు. అర్చకులు రంపా సూర్యనారాయణ శర్మ వేదమంత్రోచ్ఛారణతో పూజలు చేపట్టారు. అనంతరం శుక్రవారం రాత్రి దీపారాధన కార్యక్రమం నిర్వహించారు మహిళలు వెలిగించిన శివలింగం ఆకారంలోని దీపాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఏపీ గ్రామ సహాయకుల సంఘం అధ్యక్షుడిగా గట్టు

వేపాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించగా ఆంధ్రప్రదేశ్ గ్రామ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గట్టు వెంకన్నను ఎన్నుకున్నట్టు సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుల సమావేశంలో గట్టును ఏకగ్రీవంగా రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు వెంకన్న తెలిపారు. గట్టు వెంకన్న వేపాడ మండలంలోని రామస్వామిపేట గ్రామ సహాయకుడుగా పని చేస్తున్నారు. గట్టు ఎన్నికపై మండల గ్రామ సేవకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిలో శిశువు మృతి

● వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితుల ఆరోపణ

చీపురుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లి గర్భంలో శిశువు మృతిచెందిన ఘటన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటుచేసుకుంది. వైద్యులు సకాలంలో స్పందించి సర్జరీ చేయని కారణంగానే శిశువు మృతి చెందిందని బాధితులు ఆరోపించగా, మలాన్ని మింగడం వల్ల శిశువు మృతి చెందినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆసుపత్రి వద్ద శుక్రవారం రాత్రి బాధితులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలంలోని కాపుశంబాం గ్రామానికి చెందిన ఏనాతల మౌనిక ప్రసవం నిమిత్తం శుక్రవారం ఉదయం ఆరున్నర సమయంలో చీపురుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అప్పటికి విధుల్లో ఉన్న వైద్యుడు ఆమెను పరీక్షించి, పరిస్థితి అంతా బాగుందని చెప్పారు. సహజ ప్రసవం కోసం నిరీక్షించాలని చెప్పి, సాయంత్రం వరకూ ఆసుపత్రిలోనే ఉంచారు. ఆమె పరిస్థితిని ఎప్పటికప్పుడు గైనకాలజిస్ట్‌కు వివరిస్తూ వచ్చారు. సాయంత్రం ఆసుపత్రికి చేరుకున్న గైనకాలజిస్ట్ సహజ ప్రసవానికి అవకాశం లేదని, సర్జరీ చేయాలని చెప్పారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో బిడ్డ పరిస్థితిని పరీక్షించి, మౌనికకు సిజేరియన్ నిర్వహించారు. అయితే అప్పటికే శిశువు మృతి చెందింది. దీంతో మౌనిక బంధువులు.. వైద్యురాలి నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని ఆందోళనకు దిగారు. దీంతో సమాచారం తెలుసుకున్న మౌనిక బంధువు గవిడి సురేష్ ఆసుపత్రికి చేరుకొని మౌనిక తల్లిదండ్రులు, బంధువులకు సర్ది చెప్పారు.

కొర్లాంలో బాక్స్ కల్వర్టు ఏర్పాటుకు చర్యలు

గంట్యాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కొర్లాం రైతుల పోరాటం ఫలించింది. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలతో పాటు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో రైతులకు న్యాయం జరిగింది. కొర్లాం చెరుకు కాట వద్ద జాతీయ రహదారి మధ్యలో బాక్సు కల్వర్టు వేసేందుకు హైవే అధికారులు అంగీకరించడంతో రైతులకు సాగునీరు సమస్య తీరనుంది. రామవరం నుంచి చిలకగెడ్డ వరకూ హైవే అధికారులు రహదారి విస్తరణ కార్యక్రమం చేపట్టారు. డొంకలగెడ్డ నుంచి జగన్నాధసాగర్‌లోకి రహదారి మధ్యలో ఉన్న మదుముల ద్వారా సాగునీరు వచ్చేది. రహదారి విస్తరించడం వల్ల మదుములు కాకుండా బాక్సు కల్వర్టులు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అయినా హైవే అధికారులు పట్టించుకోలేదు. ఈ పరిస్థితిలో రైతులు రహదారి పనులను అడ్డుకున్నారు. దీనిపై కలెక్టరుకు పలుమార్లు సమస్యను విన్నవించుకున్నారు. అప్పటిలో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు కూడా వచ్చాయి. పలుమార్లు ఆర్డీవోలు కూడా ఆయా ప్రాంతానికి వచ్చి పరిశీలించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి సీఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు. మంత్రి ప్రత్యేక శ్రద్ధతో అధికారులను సంప్రదించి కొర్లాం కాటా వద్ద రహదారి మధ్యలో బాక్సు కల్వర్టు ఏర్పాటుకు ఒప్పించారు. దీంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

పోస్టల్ బ్యాంక్ సేవలు వినియోగించుకోండి

కొత్తవలస, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్టు బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని శృంగవరపుకోట జోన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి. సతీష్ తెలిపారు. పోస్టల్ శాఖ, ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ ద్వారా ప్రభుత్వ డైరెక్టు బెనిఫిట్‌ను లబ్ధిదారుకు బదిలీ చేసేందుకు ఈ ప్రత్యేక ఖాతాలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు ప్రయోజనకరమైన అనేక సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

విజయనగరం టౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా విజయనగర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రెడ్ క్రాస్ సొసైటీ ఆరోగ్య అధికారి పి.సిహెచ్.వేణుగోపాలరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడంతో మరణాల సంఖ్యను తగ్గించవచ్చని తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.అప్పారావు, జంతు శాస్త్ర విభాగాధిపతి రూపవాణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌ని కలిసిన ఐవీపీ రాజు

విజయనగరం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ని విజయవాడలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్ది రోజుల్లో పంపిణీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో తమ సీనియారిటీని గుర్తించి, అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. దీనికి స్పందించిన శ్రీనివాసరావు, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు పనుల పరిశీలన

బాడంగి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగడ గ్రామ పంచాయతీలో జరుగుతున్న పల్లె పండుగ డబ్ల్యూబీఎం రోడ్డు పనులను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. పనులు మరింత వేగవంతం చేయాలని, ఎక్కడ ఎటువంటి సాంకేతిక సమస్య ఉన్నా టెక్నికల్ అసిస్టెంట్ దృష్టికి తీసుకురావాలన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో, ఈసీ, టీఏలు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

రాజాం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు కార్యక్రమాలు ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో ఉంటుందని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎల్ జోషప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదుకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు.

విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బొబ్బిలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముచ్చల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాల మేరకు విజయనగరంలో జరిగిన పెంచిన విద్యుత్ చార్జీలపై నిరసన కార్యక్రమంలో బొబ్బిలి నుండి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచడం దుర్మార్గమని, దీనికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

వేపాడ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా నీటి పారుదలశాఖ ఈఈ ఎం.వి.రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో అధికారులతో శుక్రవారం నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బంది అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కబ్జాకోరులకు శిక్ష పడాల్సిందే

చీపురుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాలకు పాల్పడిన వారికి 14 ఏళ్ల జైలు శిక్ష నిర్ణయం సరైనదేనని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని పునరుద్ధరించాలని మంత్రి మండలి నిర్ణయించడం మంచి పరిణామమన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి

చీపురుపల్లి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిపై లేని పోని ఆరోపణలు మానుకుని, నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కళావెంకటరావు దృష్టి పెట్టాలని వైసీపీ నాయకులు వ్యాఖ్యానించారు. ఆ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు తదితరులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టిన నాటి నుంచి నియోజకవర్గంలో వెలుగు, అంగన్‌వాడీ, రేషన్ డీలర్ల తొలగింపులపైనే ఎమ్మెల్యే దృష్టి పెట్టారని నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా, నియోజకవర్గ ప్రజలకు మేలు చేసే పనులపై దృష్టి పెట్టాలని వారు కోరారు.

22 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యంతో పట్టుకున్న లారీ

కొత్తవలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండడంతో శుక్రవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు కొత్తవలస జంక్షన్‌లో పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్‌కు వచ్చిన సమాచారం మేరకు కార్యాలయంలో పనిచేస్తున్న సీఐ డీపీవీ సతీష్‌కుమార్‌ను అప్రమత్తం చేశారు. వేపాడ మండలం, రామస్వామి పేట గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మి శ్రీనివాస ఇండస్ట్రీ నుంచి ఈ బియ్యం తరలి వస్తున్నట్లు గుర్తించారు. అప్రమత్తమైన సీఐ, సీఎస్‌డీటీ ఎల్. రామకృష్ణ కొత్తవలస జంక్షన్‌లో వేచి ఉండడంతో లారీ వచ్చింది. అధికారులు ఈ లారీని ఆపి తనిఖీ చేయగా 22 టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ బియ్యం పేద ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉండగా అక్రమంగా తరలిస్తున్నారు. ఈ మేరకు లారీతో సహా బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ బొడ్డుకొండలరావు, బియ్యం వ్యాపారం చేస్తున్న పి.రామారావు మీద కేసు నమోదు చేశారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరిపై చర్యలు ఉంటాయన్నారు. ఈ దాడిలో విజిలెన్స్ శాఖకు చెందిన పి.లక్ష్మీ నారాయణ, ఎస్. రమేష్, కొత్తవలస వీఆర్వో రామానుజం పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు

రాజాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం గొలుసు దుకాణాలు నియంత్రణే లక్ష్యంగా రాజాం, రేగిడి మండలాల్లో దాడులు నిర్వహించి ఆరుగురుపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ జైభీమ్ తెలిపారు. రాజాం మండల పరిధిలోని పొగిరి గ్రామానికి చెందిన ఇద్దరు, దగ్గిముడిదాం గ్రామానికి చెందిన ఒకరు, బొద్దాం గ్రామానికి చెందిన ఒకరు, రేగిడి ఆమదాలవలస మండలం సరసనాపల్లి, బూరాడ గ్రామానికి చెందిన ఒక్కొక్కరిని ఆయా మండలాల తాహసీల్దార్ల వద్ద హాజరు పరిచి ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేశామన్నారు.

గజపతినగరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతూ పట్టుబడిన 8 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్‌శాఖ సీఐ జనార్దనరావు శుక్రవారం తెలిపారు. గతంలో అమ్మకాలు చేపడుతూ పట్టుబడిన వారు ప్రస్తుతం అదే విధంగా మద్యం అమ్మకాలు చేయడంతో తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మద్యం అక్రమ విక్రయదారుల అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాజాం మండలం రాజయ్యపేట కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పైలా దుర్గారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ సీహెచ్ రాజశ్రీ తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాల మేరకు ఈ దాడులు చేశామని తెలిపారు. బాడంగి మండలం వాడాడ గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెడ్డి రాఘవరావును అదుపులోకి తీసుకుని 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ సుదర్శన్‌కుమార్, కానిస్టేబుల్స్ బీఎస్ ప్రసాద్, బి రాము తదితరులు పాల్గొన్నారు.

వేపాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాది గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్న వ్యక్తిపై దాడి చేసి 66 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్యేక ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ కే.ఇందిరాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ మద్యం వ్యాపారంపై వచ్చిన సమాచారం మేరకు కొత్తవలస ఎక్సైజ్‌శాఖ సీఐ రాజశేఖర్ నాయుడు, సిబ్బందితో కలిసి ఈ దాడి చేశామని తెలిపారు. ఈ మేరకు మద్యం అమ్మకం జరుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

గంజాయి కేసులో అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఆరుగురు యువకులను విజయనగరం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు విజయనగరం ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన యువకులు స్నేహితులుగా ఉంటూ ఒక ప్రాంతంలో చదువుకుంటున్నారు. వీరు చెడు వ్యసనాలకు అలవాటుపడి వారి అవసరాలకు ఒడిసా నుంచి గంజాయిని తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లుగా వన్‌టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు రైడ్ చేసి ఆరుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వన్‌టౌన్ పీఎస్ ఇంచార్జి సీఐ ఎల్.అప్పల నాయుడు సీజ్ చేశారు. నిందితులు చింతలవలసకు చెందిన కోరుకొండ కార్తీక్, గంట్యాడ మండలం కొత్తవెలగాడ గ్రామానికి చెందిన పాపలకిరీటి, రొంగలానంద్, జీఎల్‌పురం మండలానికి చెందిన పురుషోత్తం జగదీష్, విజయనగరం పట్టణం గాజులరేగకు చెందిన బెహరా దీపక్ పట్నాయక్, కామాక్షినగర్‌కు చెందిన పెనుమజ్జి లోకేష్‌కుమార్ గంజాయి తాగుతూ, స్నేహితులకు విక్రయిస్తూ పట్టుబడ్డారని ఎస్పీ తెలిపారు.

రామభద్రపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుకు సంబంధించి వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019 జూన్ 15న విశాఖ జిల్లా తామరవీధి గ్రామం నుంచి 171 కిలోల గంజాయిన వ్యాన్‌లో తరలిస్తుండగా మండల పరిధిలోని కొట్టక్కి పెట్రోబంకు సమీపంలో పట్టుకున్నారు. ఈ కేసులో అప్పట్లో ఏవన్ నిందితుడిగా ఉన్న వెల్లంగి రమేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అతను ఇచ్చిన సమాచారం మేరకు ఏ-3 నిందితుడిగా ఉన్న చందా రాజశేఖర్‌ను స్థానిక బైపాస్ రోడ్డులో శుక్రవారం అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు. ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో ఒకరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు, సీఐ ఉపేంద్రరావు

రాజాం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ కేసులో వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ ఉపేంద్రరావుతో కలిసి చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు శుక్రవారం వెల్లడించారు. బలిజిపేట మండలం పణుకువలస గ్రామానికి చెందిన సుధాకర్ బతుకుతెరువు కోసం ఈ ఏడాది ప్రారంభంలో రాజాం వచ్చాడు. పాలకొండ రోడ్‌లో ఓ ప్రయివేటు షోరూంలో చేరాడు. అక్కడ పనిచేస్తున్న సమయంలోనే భార్య విడిచిపెట్టి పుట్టింటికి వెళ్లిపోవడంతో మానసికంగా కృంగిపోయి వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో అక్కడి యాజమాన్యం సుధాకర్‌ను తొలగించింది. ఈ నేపథ్యంలో రాజాంలో ఓ బార్లో ఉన్న సుధాకర్‌కు ఓవ్యక్తి పరిచయం అయ్యాడు. అప్పటికే పాలకొండ రోడ్‌లో చోరీ చేసేందుకు ఓ ఇంటిని ఎంచుకుని రెక్కీ నిర్వహిస్తున్న అతను చోరీ చేసేందుకు సుధాకర్ సహాయం అడిగాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సుధాకర్ సరేనని ఒప్పుకున్నాడు. అదేరోజు రాత్రి పాలకొండ రోడ్‌లోని లక్ష్మీనగర్‌లోని సలాది శారద ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈనెల 2న తాము ఇంట్లో లేని సమయంలో 27 తులాల బంగారం చోరీకి గురయ్యిందని శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతకవిటి ఎస్.ఐ. గోపాల్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో సుధాకర్ పట్టుబడ్డాడు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. అతడు పట్టుబడితే తప్ప వాస్తవాలు బహిర్గతం కావని డీఎస్పీ రాఘవులు స్పష్టం చేశారు. నిందితుడి నుంచి ఒకటిన్నర తులాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

రాజాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలలను షాపుల్లో పెట్టుకుని పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజాం లేబర్ అధికారి బి.కొండలరావు, సంతకవిటి ఏఎస్ఐ ముద్దూరు వాసుదేవరావు హెచ్చరించారు. శుక్రవారం సంతకవిటి పరిధిలోని రాజాంలో పలు షాపులను తనిఖీ చేశారు. చదువుకునే వయస్సులో ఉన్న పిల్లలతో పనులు చేయిస్తే షాపు యజమానులకు, తల్లిదండ్రులకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా చైల్డ్ లేబర్‌ను పెట్టుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోపం ఎక్కడ?

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తు న్నారు. కాగా గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు కూటమి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుం టున్నప్పటికీ.. ఫలితాలు ఆశించి నంతగా లేవు. ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలే ఇందుకు నిద ర్శనంగా చెప్పొచ్చు. క్షేత్రస్థాయిలో ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షకులు, కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడమే ఈ పరిస్థితికి కారణమనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను వారు ఏ మాత్రం పట్టించుకో వడం లేదనే వాదనలు లేకపోలేదు. కొన్నిచోట్ల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందించడం లేదనే విమర్శలున్నాయి.

న్యాయం చేస్తాం

(ఐదో పేజీ తరువాయి)

ఉంటుందని, కలెక్టర్, ఐటీడీఏ పీవోలతో మాట్లాడి త్వరలోనే న్యా యం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠ శాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఏఎన్ఎం లను నియమిస్తామని ఆమె తెలిపారు. సచివాలయాల్లో పనిచేస్తున్న వారినే ఆశ్రమ పాఠశాలలకు నియమించేలా చర్యలు తీసుకుంటామ న్నారు. పార్వతీపురం, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, ఎంపీపీ బి.సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

● మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తప్పు డు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. సాలూరు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో స్వతంత్రం లేదని జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతున్న తీరు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. సోషల్ మీడియాలో జగన్ అనుచ రుల పోస్టుల తీరు దారుణంగా ఉందన్నారు. 'నీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రజలకు తిట్టవచ్చు కానీ ఎవ్వరూ నీ భార్యను నీ పిల్లలను ఏమీ అనకూడదు, మేం అనము అది మా సభ్యత.. సంస్కారం' అని అన్నారు. ఎవరైనా సరే తప్పుడు పోస్టింగులు పెట్టినా, ఇష్టానుసారం గా మాట్లాడినా పోలీసు యంత్రాంగం తాట తీస్తుందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి తక్షణం న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ సమావేశ టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతి రావు, పరమేష్, గుళ్ల వేణు, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు మండలంలో కలెక్టర్ పర్యటన

సాలూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కురుకూటి అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఎశ్యాంప్రసాద్ శుక్రవారం పరిశీలించి.. చిన్నారులకు అంకెలు తదితర వాటిని అడిగారు. వారికిస్తున్న పౌష్టికా హారాన్ని సీడీపీవో విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జీడిపిక్కల ప్రాసెసింగ్ సెంటర్‌ను పరిశీలించారు. వెలుగు ఏపీఎం సింహాచలం దాని గురించి వివరించారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీ లించి రికార్డులను పరిశీలించారు. ప్రజల ఆరోగ్యపరిరక్షణకు శ్రద్ధ చూపాలని వైద్యసిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్య పనులపై పర్యవేక్షణ ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గొల్లపల్లి పార్వతిని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బడితోటలను పెంచాలన్నారు. గ్రామపంచాయతీల్లో బాలవిహార్ నిధులతో ఆట మైదానాలు నిర్మిస్తామన్నారు. మరుగుదొడ్లు వినియో గించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కురుకూటిలో సెల్ టవర్, తాగునీటి ట్యాంక్ కావాలని వారు కోరారు. వెలగవలసలో పాఠశాలను పరి శీలించారు. విద్యార్థులను పద్యాలను చెప్పాలని కోరారు. పుస్తకం చూపించి చదవాలన్నారు. పాఠశాల పరిస్థితులను హెచ్ఎం మన్మథ రావు వివరించారు. కార్యక్రమంలో కురుకూటి సర్పంచ్ ప్రతినిధి అప్పారావు, తహసీల్దార్ ఎన్వీ రమణ, ఇన్‌చార్జి ఎంపీడీవో పార్వతి, ఏఎం సింహాచలం, సీడీపీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కురుపాంలో పల్లెబాట

కురుపాం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో పల్లె నిద్ర కార్యక్రమం అనంతరం శుక్రవారం ఉదయం కురుపాంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణారావు పల్లె బాట కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థానిక మంతినివలసలో సందర్శించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్లను పరిశీలించి అవసరమైన వసతులపై హెచ్ఎం శంకరరావుకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కె.చంద్రశేఖర రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీవీ రమణమ్మ, ఎంఈవో సత్యనారా యణ, సర్పంచ్ గార్ల సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల బియ్యం స్వాధీనం

కొమరాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విక్రాంపురం గ్రామంలోని సారికవీధిలో మేరంగి గంగయ్య వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కొమరాడ సీఎస్‌టీడీ ఎం.రాజేంద్ర తన సిబ్బందితో గంగయ్య ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 17.50 క్వింటాళ్ల బియ్యం (35 గోనె సంచుల్లో) నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. వసతి గృహానికి 89 బస్తాల్లో బియ్యం తీసుకువెళుతున్న వాహనం విక్రాంపురం గ్రామంలో 35 బస్తాలను గంగయ్య ఇంట్లో దించినట్లు గుర్తించామని చెప్పారు. అంతేకాకుండా 17 గోనె సంచుల కుట్లను కూడా విప్పదీయడాన్ని గమనించామని సీఎస్‌డీటీ తెలిపారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదు చేసి, సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక డీలర్‌కు అప్పగించామన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అలసత్వం తగదు

గరుగుబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధి కారి ఓ.ప్రభాకరరావు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామదర్శినిలో భాగంగా పీహెచ్‌సీ, రక్షిత మంచినీటి పథకాల పనితీ రు, అలాగే పారిశుధ్య నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల ముందు అపారిశుధ్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుబయట మల విసర్జన చేయకుండా ప్రత్యేక దృష్టితో పాటు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకర్, సీనియర్ సహాయకులు బి.రవిరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

సాలూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 9 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్.సింహాచలం తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన ఎనిమిదో తరగతి విద్యార్థులు సాయి వినోద్, వెంకటరావులను శుక్రవారం ఐటీడీఏ సాలూరు ఏటీడబ్ల్యూవో కె.శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ లచ్చయ్య, పీడీ ఈశ్వర్ ఉన్నారు.

అభివృద్ధి నోచుకోని

క్రీడా మైదానం

● ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు, వాకర్స్

● నిర్లక్ష్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు



ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఇదే

పార్వతీపురంటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎంతోమంది జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు ఇక్కడే ప్రాక్టీసు చేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అనేకమంది ఇక్కడే నడకకు వస్తారు. కొన్ని ప్రభుత్వం కార్యక్రమాల నిర్వహణకు ఇదే వేదిక అవుతోంది. ఇది జిల్లా కేంద్రంలోనే ఒకేఒక్క క్రీడా మైదానం. కానీ విద్యాశాఖాధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఈ మైదానం అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది కళాశాలకు చెందిన క్రీడా మైదానం అయినప్పటికీ నిర్వహణకు కళాశాల ప్రిన్సిపాల్, విద్యాశాఖాధికారులకు నామమాత్రపు హక్కులు కల్పించారు. వారు అభివృద్ధి చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ మైదానంలో కనీసం తాగునీటి సదుపాయం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాలు పేరుకుపోతున్నాయి. ఇక చీకటి పడితే క్రీడా మైదానం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారు తోందని వాకర్స్ క్లబ్‌ల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ● ఇప్పటికే క్రీడా మైదానం సమస్యలను ఎమ్మెల్యే విజయచంద్ర దృష్టికి మార్నింగ్ స్టార్, నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యులు తీసుకువెళ్లారు. పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వీడని ఉత్కంఠ

● స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై కొనసాగుతున్న సస్పెన్స్

● కోడ్ అమలుపై జడ్పీ సీఈవో మార్గనిర్దేశం

సాలూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎన్నికల కోడ్ అమలు చేయాలని శుక్రవారం ఎంపీడీవోలకు జడ్పీ సీఈవో నుంచి మార్గనిర్దేశా లు రావడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై ఫిర్యాదు అందడంతో శాసన మండలి చైర్మన్ జూన్ 3న అనర్హత వేటు వేశారు. దీంతో ఎలక్షన్ కమిషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 4న నోటిఫికేషన్ రాగా 6న రఘురాజు సభ్యత్వం పునరుద్ధరిస్తూ.. ఈ వ్యవహారం తిరిగి మండలి చైర్మన్ వద్దకు పంపుతున్నట్టుగా హైకోర్టు పేర్కొంది. దీంతో ఈ ఉప ఎన్నిక జరుగుతుందా.. లేదా అన్న సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఉప ఎన్నిక నిలిచిపోతుందని అంతా భావించారు. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎలక్షన్ కమిషన్ నుంచి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఉప ఎన్నిక నిర్వహణపై అధికారుల్లో సైతం సందిగ్ధత నెలకొంది. మరోవైపు వైసీపీ అభ్యర్థిగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నామినేషన్ దాఖలు చేశారు. కూటమిలో మాత్రం ఎటువంటి కదలిక లేదు. ఉమ్మడి జిల్లాలో ఒక ఎమ్మెల్సీ 549 ఎంపీటీసీలు, 34 జడ్పీటీసీలు, 50 కార్పొరేటర్లు, 110 కౌన్సిలర్లు, 9 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మొత్తం 753 స్థానాలున్నాయి. వాటిలో 22 స్థానాలు ఖాళీలున్నాయి. మిగిలిన స్థానాల్లో పార్టీల పరంగా వైసీపీకి 592 మంది, టీడీపీకి 122 మంది సభ్యులు న్నారు. పార్టీపరంగా వైసీపీకి మెజార్టీ ఉంది. అయితే ఎన్నిక విషయమై ఎలక్షన్ కమిషన్ నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు. మరోవైపు కోడ్ అమలుకు అధికారులు సన్నద్ధంగా ఉండడంతో ఉప ఎన్నిక ఈ నెల 28న జరుగుతుందా? చివరి క్షణంలోనైనా ఆగుతుందా? అనేది సర్వత్రా చర్చనీయాంశ మవుతోంది. ఇదిలా ఉండగా నామినేషన్ దాఖలుకు ఈ నెల 11 వరకు గడువు ఉంది. ఈలోగా కూటమి ఏ విధమైన ప్రకటన చేస్తోందనోనని పలువురు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

శత శాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలాదృష్టి సారించాలని జిల్లా సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎండీ గయాజుద్దీన్ అన్నారు. పల్లె నిద్రలో భాగంగా రాయవలస ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆయన శుక్రవారం రాత్రి సందర్శించారు. పదో తరగతికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు అందించే మెనూలో లోపాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. విద్యార్థుల నుంచి పలు ప్రశ్నలకు జవాబులను రాబట్టారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంరక్షకులు పి.ధర్మారావు పాల్గొన్నారు.

ఎస్సీ వసతిగృహం మరమ్మతులకు ప్రతిపాదనలు

పార్వతీపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహం మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి ఎండీ గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవా రం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహం నిర్మాణానికి నేటికి 25ఏళ్ల గడిచిందన్నారు. మరమ్మతులు కోసం రూ.1.20 లక్షలు ప్రతిపాదనలు పంపించినట్టు వెల్లడించారు. అలాగే జిల్లా పరిధిలో వసతి గృహాలు మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు చేశారని చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన

సీతంపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్ర మ బాలుర ఉన్నత పాఠశాలను పాలకొండ ఇన్‌చార్జి జూనియర్ సివిల్‌జడ్జి పీఎస్‌వీడీ కృష్ణసాయి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు భోజన సౌకర్యం ఎలా ఉంది, మెనూ అమలు, పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల వార్డెన్ రామ్మోనరావుకు సూచించారు. ఈ పరిశీలనలో ఏటీడబ్ల్యూవో మంగవేణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న లోక్ అదాలత్ సభ్యుడు జోగారావు

గరుగుబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు(పార్వతీపురం) టి.జోగారావు కోరారు. శుక్రవారం గొట్టివలస గ్రామంలో అసంఘటిత కార్మికులకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ సేవల దినోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు, గిరిజనులకు సంబంధించి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారి వెంకటేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ గొల్లు శ్రీహరితో పాటు సర్పంచ్ బి.చంద్రినాయుడు, మాజీ సర్పంచ్ పి.పూర్ణచంద్రరావు, మహిళా పోలీస్ జి.పుష్ప, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై పర్యవేక్షణ

సీతానగరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగంపేట గ్రామంలో మరడ సింహాచలం అనే రైతు పొలంలో శుక్రవారం చేపట్టిన పంట కోత ప్రయోగాన్ని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పర్యవేక్షించారు. 5 ఇంటూ 5 విస్తీర్ణంలో చేపట్టిన పంట కోత ప్రయోగంలో 14.480 కిలోల దిగుబడి వచ్చినట్టు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 128 పంట కోత ప్రయోగాలు చేప డుతున్నామని, అలాగే జిల్లా వ్యాప్తంగా 1768 వరి పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి 100 హెక్టార్ల వరి పంట విస్తీర్ణా న్ని ఒక యూనిట్‌గా తీసుకుని 4 పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తారని చెప్పారు. ఒక యూనిట్‌లో వచ్చిన దిగుబడి ఆధారంగా పంట ల ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు నిర్ణయిస్తారని వివరించారు. ఈ పంట కోత ప్రయోగాల ద్వారా వచ్చే దిగుబడి ఆధారంగా వ్యవసాయ రంగంలో రాష్ట్రం స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీడీపీ) అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంకాధికారి కోట జయప్రకాష్, ఎంఆర్‌వో ఉమామహేశ్వరరావు, ఏవో ఎస్.అవినాష్, మండల గణాంకాధికారి సతీష్, వీఏఏ ఎం.వా సు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నెధార కొండపై పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు

సీతంపేట రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యో తి): మండలంలో పులిపుట్టి పంచాయతీ పరిధి లో ఉన్న కన్నెధార కొండపై పర్యాటక అభివృద్ధికి ఐటీడీఏ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తు న్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఐటీడీఏ అధికారులు కన్నెధార కొండ ప్రాంతంలో ఉన్న పీపీ ఈతమానుగూడ, పులిపుట్టి పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో పర్యటించి గిరిజ నుల నుంచి వివరాలను సేకరించారు. ఈ నెల 12, 13వ తేదీల్లో పర్యాటకశాఖ, ఐటీడీఏ అధికా రుల బృందం కన్నెధార కొండను పరిశీలించిన అనంతరం సర్వే చేసి అక్కడ పర్యాటకానికి గల అవకాశాలను పరిశీలించనున్నట్టు ఐటీడీఏ అధికారి సతీష్ తెలిపారు. కన్నెధార కొండపై వ్యూ పాయింట్, రహదారులు, ట్రెక్కింగ్ రూట్, రోప్ వే వంటివి ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. ఈ పరిశీలనలో నవర తోట మొఖలింగం, బాజన్న, సొదంగ ఉన్నారు.

రైతులపై నిర్లక్ష్యం తగదు

బెలగాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్లాలో ధాన్యం ఉంటే ఇంతవరకు కొనుగోలు ప్రారంభించలేదని, రాష్ట్ర ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పంటలు పండించి ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించలేదని ఆరోపించారు. దీంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయించడం వల్ల ఎకరాకు సుమారు రూ.1,500 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతుభరోసా ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బంటు దాసు, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల విస్తీర్ణం పెంచాలి

గరుగుబిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రా మీణ ప్రాంతాల్లో ఔషధ మొక్కల పెంపకం విస్తీ ర్ణం పెంచేందుకు కృషి చేయాలని జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు సూచించా రు. శుక్రవారం తోటపల్లి ట్రస్టు నూతన కార్యాల య ఆవరణలో కురుపాం మండలానికి చెందిన మహిళా రైతులకు, మూలికా వైద్యులు, మహిళా సంఘ సభ్యులకు శిక్షణ నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతా ల్లో అధిక విస్తీర్ణంలో ఔషధ మొక్కలు పెంచితే ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, వైద్య నిపుణుడు టి.శివకేశవరావు, ఆర్‌వైఎస్ఎస్ పాఠ శాల సిలబస్ జూనియర్ కన్సల్టెంట్ పి.శివాజీ, రైన్ ఫారెస్ట్ తమోటిక్ కోఆర్డినేటర్ ఎ.శిరీష, జట్టు ట్రస్ట్ కోడైరెక్టర్ ఎం.నూకంనాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ ఎం.మణికుమారి, మాజీ సర్పంచ్ బి.మంజుల పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు

భామిని, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తులను ఆ క్రమిస్తే చర్యలు తప్పవని తహసీ ల్దార్ ఎస్.అప్పారావు హెచ్చరించారు. శుక్రవారం సొలికిరి వంశధార గట్టు చదును చేస్తుండడంతో రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. వరద కాలువ మట్టిని జేసీబీతో తొలగించి ట్రాక్టర్లతో తరలిస్తున్నారని సమాచారం తెలియడంతో ఘటనా స్థలానికి ఆర్ఐ కృష్ణారావు, వీఆర్వో రామారావు చేరుకున్నారు. చదును చేయడానికి వీలు లేదని సూచించడంతో నిలుపుదల చేశారు. సమాచారాన్ని వంశధార ప్రాజెక్టు అధికారులకు అందజేశామని తహసీల్దార్ తెలిపారు.



చదును చేస్తున్న స్థలంలో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

గుంతలు పూడ్చారు

● అధ్వానంగా రహదారులు

● స్పందిస్తున్న పోలీసు శాఖ

కురుపాం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కురుపాం మొయిన్ రోడ్డులో ధూళికేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఏర్పడిన గుంతలను ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కప్పించారు. ఈ ప్రాంతంలో గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉన్నారు. దీంతో స్పందించిన ఎస్ఐ.. శుక్రవారం ఈ గుంతల్లో మట్టిపోయించారు. ఈ సందర్భంగా పోలీసులను వాహనదారులు అభినందించారు.



గుంతలు కప్పిస్తున్న ఎస్ఐ నారాయరావు, పోలీసు సిబ్బంది

ఏఎన్ఎం ఆత్మహత్యా యత్నం

కురుపాం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొండెంఖల్ పీహెచ్‌సీ పరిధిలోని కొండబారిడి సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎంగా పనిచేస్తున్న ఓ మహిళ శుక్రవారం మలేరియా మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నం చేసుకుంది. ఈమెకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్య ప్రయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గౌరవ వేతనం చెల్లించాలి

సాలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బూత్ లెవెల్ అధికారులకు రెండేళ్లగా చెల్లించని గౌరవ వేతనాలు చెల్లించాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీ రమణ కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్వో లుగా పని చేస్తున్నామని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. సంవత్సరానికి రూ.6వేలు చెల్లించాల్సి ఉండగా గత రెండేళ్లగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎల్వోలు

న్యూస్ బాక్స్

పూర్తి స్థాయిలో నీటి సరఫరా

పార్వతీపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పురపాలక సంఘం ఏఐఐబీ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, ఆ పనులు పూర్తయితే పట్టణంలోని పూర్తి స్థాయిలో తాగునీటిని సరఫరా చేయవచ్చని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు తెలి పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన 'గొతుల్లో దిగితేనే గొంతు తడిచేది' అనే వార్తకు స్పందిస్తూ ఆయన ఈ విధంగా వివరించారు.

నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు

మక్కువ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన మండల నాయకుడు పెంట తిరుపతిరావు శుక్రవారం విజయవాడ లో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జనసేన ఇన్‌చార్జి ఆదాడ మోహన్‌రావు, జనసైనికులు ఉన్నారు.

జాతర తేదీల ఖరారుకు సమావేశం

మక్కువ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి జాతర వచ్చే ఏడాది జరగనున్న నేపథ్యంలో తేదీల ఖరారు కు ఈనెల 10న అమ్మవారి చదురుగుడిలో గ్రామపెద్దలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు.

ఓటు నమోదు చేసుకోండి

భామిని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.అప్పారావు కోరారు. శుక్రవా రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎ ల్వోలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

చలో విజయవాడుకు వెళ్లొద్దంటూ నోటీసు

సాలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వలంటీర్ల సమస్య పరిష్కారంపై ఈనెల 9న జరగనున్న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లవద్దంటూ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురా లు బలగ రాధకు సాలూరు పట్టణ పోలీసులు శుక్రవారం నోటీసు ఇచ్చారు. ఇలా నోటీసు ఇవ్వటం సరికాదని ఆమె అన్నారు.

గుజరాత్ హైకోర్టు జడ్జిని కలిసిన సబ్ కలెక్టర్



జడ్జికి మొక్కను అందజేస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపు రం, నవంబరు 8 (ఆంధ్రజ్యో తి): జిల్లా పర్యటనలో భాగంగా పార్వతీపురాని కి విచ్చేసిన గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ సీ హెచ్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మర్యాదపూర్వకంగా శుక్ర వారం కలిశారు. ఈసందర్భంగా ఆయనకు మొక్కను అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

వీరఘట్టం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టిపుడివలస గ్రామ సమీ పంలో తోటలో శుక్రవారం నిర్వహిస్తున్న పేకా ట శిబిరంపై ఎస్ఐ కళాధర్, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,300 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.